పడకేసిన పారిశుద్ధ్యం

- సైడు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు
- దుర్వాసన వెదజల్లుతున్న సైడు కాలువలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలో పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఎటు చూసినా చెత్తాచెదారంతో నిండి వీధులు, మురుగునీరు రోడ్డెక్కి పారుతున్న దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మురికినీటి వలన దోమలు విజృంభిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామంలో ప్రధాన రోడ్లన్నీ చెత్తతో నిండి దర్శనమిస్తున్నాయి. సైడుకాలువలు నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. అంతేకాక రాచర్ల బస్‌స్టాండ్ సెంటర్‌లో ఇరువైపులా ఏర్పాటు చేసిన సైడుకాలువలు ఆక్రమించుకుని వివిధ షాపులు ఏర్పాటు చేసుకుని జేబులు నింపుకుంటున్నారు. అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్‌స్టాండ్ సెంటర్‌లో తాగునీరు సరఫరా చేసే పైపులైనుకు వాల్వ్ ఏర్పాటు చేయగా ఆ వాల్వ్ గుంతలో నీరు నిలబడి వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని బస్‌స్టాండ్ సెంటర్‌లో సైడుకాలువలపై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న కట్టడాలను తొలగించి, సైడుకాలువల్లో పేరుకునిపోయిన వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రాచర్లలో వ్యర్థాలతో నిండిపోయిన సైడుకాలువ



దుర్వాసన వెదజల్లుతున్న తాగునీటి వాల్వు



ఆక్రమణకు గురైన సైడుకాలువలు

ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం

- ఆర్టీసీ ఆర్ఎం వెంకట్రావు

మార్కాపురం: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆర్టీసీ ఒంగోలు ఆర్ఎం వెంకట్రావు చెప్పారు. బుధవారం ఆయన మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ ఉద్యోగులు ఎల్లవేళలా పనిచేస్తున్నారని చెప్పారు. కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలని, కొత్త బోర్డు ఏర్పాటు చేయాలని డీఎంను ఆదేశించారు. ఆర్టీసీ ప్రాంగణంలో స్టాల్స్‌లో అధిక ధరలకు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన స్టాల్స్ ఏర్పాట్లను పరిశీలించాలని చెప్పారు. ఈయన వెంట డీఎం నరసింహులు, సిబ్బంది ఉన్నారు.



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎం వెంకట్రావు

వందేళ్ల వృద్ధురాలు మృతి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నరవ రోడ్డులో ఆనంద నిలయం అపార్ట్‌మెంట్‌లో మాజీ ఎమ్మెల్యే దప్పిలి పాండురంగారెడ్డి సతీమణి మాజీ ఎంపీపీ దప్పిలి లక్ష్మమ్మ (100) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఇటీవలే ఆమె 100 వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా శతాబ్ది జన్మదిన మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. లక్ష్మమ్మ మృతదేహానికి స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుమారుడు మాజీ సర్పంచి దప్పిలి విజయభాస్కర్‌రెడ్డితో పాటుగా కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నాటుసారా తయారీదారులకు బెల్లం విక్రయించొద్దు



మాట్లాడుతున్న సీఐ వెంకటరెడ్డి

మార్కాపురం: నాటుసారా తయారీదారులకు వ్యాపారులు బెల్లం విక్రయించొద్దని ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో బెల్లం వ్యాపారులతో ఆయన సమావేశమయ్యారు. వ్యాపారులు ప్రతి 15 రోజులకోసారి తమ విక్రయాలకు సంబంధించిన వివరాలు ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. నాటుసారా నిర్మూలనకు సహకరించాలని వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా, కొనుగోలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



జీలకర్ర, బెల్లం చూపుతున్న అర్చకులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత అమలక లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో 62వ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా సీతారాములవారి కల్యాణం ఆలయ అర్చకులు బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో పండితులు, వేదపండితులు కిశోర్, అర్చక బృందం స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు డీవీ కృష్ణారెడ్డి, జి.వెంకటరెడ్డి, వై.సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, యోగిరెడ్డి, మహిళా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మార్కాపురాన్ని జిల్లా చేయాలి

మార్కాపురం: వెనుకబాటులో ఉన్న మార్కాపురాన్ని జిల్లా చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ నెల 8న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కాపురం వస్తున్న నేపథ్యంలో ఆయన్ను కలిసి తమ సమస్యలు వివరించేందుకు సమయం ఇవ్వాలని ఆ వినతిపత్రంలో కోరినట్లు నాయకులు జయరాజ్, షాలేమ్ రాజు తెలిపారు. ఎస్సీ వర్గీకరణను జిల్లా యూనిట్‌గా కాకుండా రామచంద్రరాజు కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్ర యూనిట్‌గా గుర్తించాలని సీఎంను కోరనున్నట్లు తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేసి కరువును దూరం చేయాలన్నారు. గిద్దలూరు నియోజకవర్గానికి సాగర్ జలాలను కంభం మీదుగా తరలించాలని, గతంలో ఉన్న కంభం నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని సీఎంను కోరతామని చెప్పారు.



డీటీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

8న చంద్రబాబు మార్కాపురం రాక

మార్కాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన మార్కాపురం పట్టణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్నారని, అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. సీఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి ఆమె జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ త్రివినాగ్, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలతో కలిసి ఎస్వీకేపీ కళాశాల, మార్కెట్ యార్డు, జెడ్పీ బాయ్స్ స్కూల్, సాయి బాలాజీ స్కూల్ తదితర ప్రాంతాల్లో హెలీప్యాడ్, బహిరంగ సభ స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కార్యక్రమం మార్కాపురంలో జరుగుతున్నందున ఇతర జిల్లాల నుంచి మహిళా అచీవర్స్, వివిధ శాఖల హెచ్‌ఓడీలు హాజరవుతున్నారని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండి విజయవంతం చేయాలని కోరారు. బందోబస్తు ఏర్పాట్లు, సభాస్థలంలో డయాస్, బారికేడింగ్, పార్కింగ్, స్టాల్స్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, జెడ్పీ సీఈఓ చిరంజీవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కూరగాయల సాగుతో ఆదాయం

పొదిలి రూరల్: నీటి వసతి ఉన్న రైతులు తమ పొలాల్లో కూరగాయాలు సాగు చేసుకుని ఆదాయం పొందాలని ఉద్యానశాఖ అధికారి డి.సంధ్య చెప్పారు. బుధవారం పొదిలి మండలం తలమళ్ల, ఉప్పలపాడు గ్రామాల్లో సాగు చేసిన బొప్పాయి తోటలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బొప్పాయి తోటల్లో ఆంత్రక్నోజ్ తెగులు ఉందని, దీంతో కొమ్మలు, కాయలు పూతలు గోధుమ, లేక నలుపు రంగుకు మారుతాయన్నారు. నివారణకు తెగులు సోకిన, ఎండిన ఆకులు తొలగించాలన్నారు. సమతుల సమగ్ర ఎరువులను సకాలంలో అందిస్తూ సూక్ష్మధాతు లోపాలను ఎప్పటికప్పుడు సవరిస్తూ ఉండాలన్నారు. ఎదుగుదల పెంచుటకు యూరియా 10–20 గ్రా, పొటాషియం నైట్రేట్ 5 గ్రా, స్థూల పోషకాల మిశ్రమం 5 గ్రా లీటరు నీటికి కలిపి వారం రోజులకు ఒకసారి పిచికారీ చేసి మొక్కకు కావాల్సిన పోషకాలు అందించాలన్నారు.



బొప్పాయి తోటను పరిశీస్తున్న సంధ్య

అయ్యప్ప ఆలయంలో అన్న సంతర్పణ



భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ మురళి దంపతులు

పొదిలి: స్థానిక అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి బుధవారం భక్తులకు, పేదలకు అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుంది. ఈ క్రమంలో కొనకనమిట్ల ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం అన్న సంతర్పణ జరిగింది. ముందుగా మురళీకృష్ణ, రజని దంపతులు అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి మురళీకృష్ణమాచార్యులు వీరిచే పూజలు చేయించారు. అనంతరం అన్నదానం జరిగింది. పునుగుపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భూసార పరీక్షల తర్వాతే ఎరువులు వాడాలి

మార్కాపురం టౌన్: రైతులు తమ పొలాలకు సంబంధించి భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలని సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ ఏడీఏ సుచరిత తెలిపారు. బుధవారం మండలంలోని కొండేపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో ఆమె వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులుతో కలిసి పర్యటించారు. భూసార పరీక్షలు చేయించుకుని ఎరువులు వాడితే పెట్టుబడి వ్యయం తగ్గుతుందని, పంటకు సక్రమంగా ఎరువులు అందుతాయన్నారు. ఏఓ శ్రీనివాసులు మాట్లాడుతూ సబ్సిడీపై డ్రిప్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మే నెలలో రైతులు తమ పొలాల్లో లోతు దుక్కులు చేసుకోవాలని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయన్నారు. డీఆర్‌సీ ఏఓ శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ సుచరిత

బాల్యం ప్రారంభ దశలో జాగ్రత్తలు తప్పనిసరి

కంభం: బాల్యం ప్రారంభ దశలోనే పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెంచు లక్ష్మి అన్నారు. మండలంలోని యర్రబాలెం, కంభం ఎస్సీబీజీ పాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఈసీసీఈ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లల తల్లులతో సమావేశం నిర్వహించి ఎదుగుల పర్యవేక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

పిల్లల బరువు, ఎత్తు కొలిచి వారి పోషణ స్థితిని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కట్టా ప్రశాంతి, జశ్వంతి, తదితరులు పాల్గొన్నారు.



కంభంలో పిల్లల ఎత్తు కొలుస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

విధి నిర్వహణలో సమయపాలన పాటించాలి

- జిల్లా మెడికల్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మెడికల్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు

రాచర్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని జిల్లా మెడికల్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డాక్టర్లు, స్టాఫ్ నర్సులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారని స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డాక్టర్లు, మరికొంత మంది సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రావడంతో వారికి మెమో జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పనితీరులో మార్పులు రాకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలుత ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను, మందులను, వ్యాక్సిన్‌లను పరిశీలించి సిబ్బంది తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ కె.కమలాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్ట్ శివరామకృష్ణ, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

సహిత విద్యతో దివ్యాంగులకు మెరుగైన జీవనం

కంభం: సహిత విద్యతో దివ్యాంగులకు మెరుగైన జీవనం లభిస్తుందని మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసులు అన్నారు. స్థానిక భవిత కేంద్రాన్ని బుధవారం ఎంఈఓ తనిఖీ చేసి ఫిజియో థెరపీ కార్యక్రమాన్ని పరిశీలించారు. పాఠశాలలో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, రికార్డులు, బోధనా పరికరాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ మురళి, ప్రధానోపాధ్యాయుడు వరికుంట్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు ఖుర్షీద్ తమీన్, ఫిజియో థెరపిస్టు సంధ్య, ఐఈఆర్పీలు అరుణ్ కుమార్, ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ

కార్మిక పరిరక్షణ చట్టాలు అమలు చేయాలి

గిద్దలూరు రూరల్: రవాణా కార్మికుల పరిరక్షణ చట్టాలను అమలు చేయాలని ఆల్ ఇండియా రవాణా కార్మికుల ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. రవాణా రంగం పరిరక్షణకు ఈనెల 24వ తేదీ చలో పార్లమెంటును జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కార్మిక సంఘ నాయకులు పట్టణంలోని కుమ్మరాం కట్ట సెంటర్ వద్ద కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జి.శ్రీనివాసులు మాట్లాడుతూ డీజిల్, పెట్రోల్, ధరలు, బీమా ప్రీమియం టోల్ చార్జీలు తగ్గించాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, థామస్, ఆటో యూనియన్ నాయకులు రఫీ, రసూల్, నాగయ్య, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మికులు

నాణ్యమైన పొగాకు వచ్చేలా చూడాలి

పొదిలి: వేలానికి నాణ్యమైన పొగాకు తీసుకువచ్చేలా క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు సూచించారు. స్థానిక వేలం కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వేలం సన్నద్ధత గురించి పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అనంతరం క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ నుంచి వేలం ప్రారంభం కానున్న దృష్ట్యా బాగా గ్రేడింగ్ చేసిన బేళ్లను వేలానికి తీసుకురావాలన్నారు. వేలం కేంద్రంలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో శ్రీధర్‌బాబును సన్మానించారు. కార్యక్రమంలో వేలం అధికారి గిరిరాజ్‌కుమార్, దక్షిణ ప్రాంత తేలిక నేలల ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు, ప్రొడక్షన్ మేనేజర్ కేవీ రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు దండే వీరనారాయణ, అవులూరి కోటేశ్వరరావు, రేగుల వీరాంజనేయులు, బీరం కృష్ణారెడ్డి, సిద్ధవరం బ్రహ్మయ్య, చంద్రశేఖర్, పుట్లూరివారిపాలెం రామయ్య పాల్గొన్నారు.



వేలం కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీధర్‌బాబు

క్లుప్తంగా

వైద్యశాలను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

కంభం: మండలంలోని తురిమెళ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి టి. వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వైద్యశాలలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడాన్ని పరిశీలించిన ఆయన నూతన భవనం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం మీద సమీక్ష సమావేశం నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంభం: మండలంలోని నర్సిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన ప్రధానోపాధ్యాయుడు చెలిమెల వెంకటేశ్వర్లు కుటుంబానికి యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అండగా నిలిచింది. స్థానిక ఆది ఆంధ్ర పాఠశాలలో బుధవారం యూటీఎఫ్ అధ్యక్షుడు ఖాసింపీరా ఆధ్వర్యంలో యూటీఎఫ్ సంక్షేమ నిధి ద్వారా రూ.2 లక్షలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మాల్యాద్రి, సీనియర్ నాయకులు ఆవుల సుబ్బారెడ్డి, సునీల్ కుమార్, రామిరెడ్డి, వరికుంట్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

22 సీసీ కెమెరాలు వితరణ



కెమెరాలు అందజేస్తున్న నాయకులు

పొదిలి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వేమనకు బుధవారం 22 సీసీ కెమెరాలు అందజేశారు. గోల్డ్ షాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.60 వేల విలువ చేసే 14 కెమెరాలు, ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.35 వేల విలువ చేసే 8 కెమెరాలను ఎస్సైకి అందజేశారు. నేర నియంత్రణలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణంలో సుమారు 200 కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై వేమన తెలిపారు. కెమెరాలు అందజేసిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మూలమలుపులో పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డుపైకి పెరిగిన చిల్లకంప

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల సమీపంలో కంభం వెళ్లే తారురోడ్డు మూలమలుపు ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఒక వైపున చిల్లకంప ఏపుగా పెరిగింది. రోడ్డు మార్జిన్ నుంచి తారురోడ్డుపైకి చిల్లకంప పెరగడంతో రాకపోకల సమయంలో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు మార్జిన్‌లో ఏపుగా పెరిగిన చిల్లకంపను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా ఎంపీజే ఆవిర్భావ దినోత్సవం



దివ్యాంగ విద్యార్థికి స్వీటు ఇస్తున్న రజాక్

మార్కాపురం టౌన్: మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ 20వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక వికలాంగుల పాఠశాలలో ఎంపీజే ఆవిర్భావ వేడుకలు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో జరిగాయి. ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఎంపీజే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో, దేశంలో మతోన్మాద ఫాసిస్టు శక్తుల ప్రాబల్యం పెరుగుతున్న దృష్ట్యా ప్రజలను చైతన్యవంతులను చేస్తూ మత సామరస్యాన్ని కాపాడుతున్నామన్నారు. విద్యార్థులకు పండ్లు, అల్పాహారం అందజేశారు. నాయకులు నాగూర్ మీరావలి, సయ్యద్ మస్తాన్‌వలి, అబ్బాస్, అమీర్ పాల్గొన్నారు.